www.aksharadarbar.com
మంగళవారం 02, ఏప్రిల్ 2024
అక్షర దర్బార్
voice of the people
తెలుగు దినపత్రిక వరంగల్ | సంచిక :54 | సంపుటి :02 | పేజీలు : 04 | వెల : 05

రూ.260 కోట్లతో నగరాభివృద్ధి

- పదేళ్లలో చేయని అభివృద్ధిని నాలుగునెలల్లో చేశాం
- వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

02

తుక్కుగూడలోనే జాతీయ
మేనిఫెస్టో విడుదల

కాంగ్రెస్ జనజాతర సభా ప్రాంగణాన్ని పరిశీలించిన సీఎం రేవంత్‌రెడ్డి

03

03

ఛత్తీస్‌ఘడ్‌లో భారీ ఎన్‌కౌంటర్

8 మంది మావోయిస్టులు మృతి

భారీగా ఆయుధాల స్వాధీనం

హెడ్ క్వార్టర్ లో సైబర్ క్రైమ్స్ పోలీస్ స్టేషన్

ప్రారంభించిన సీపీ అంబర్ కిషోర్ ఝా

04

చర్యలేవి..?

మహనగరంలో అక్రమాలకు పాల్పడిన హార్టికల్చర్ అధికారిణి

- నర్సరీల నిర్వహణకు రూ.48లక్షలు.. మొక్కల కొనుగోలుకు రూ.46లక్షలు
- జీడబ్ల్యూఎంసీ హరిత నిధి దుర్వినియోగమైనట్లు విచారణలో వెల్లడి
- అక్రమాలపై సమగ్ర నివేదికను సర్కార్ కు పంపిన కమిషనర్
- రెండేళ్లు గడిచినా ఐఏఎస్ అధికారిణి రిపోర్ట్ బుట్టదాఖలు
- బాధ్యులపై చర్యలు లేకపోవడం పట్ల సర్వత్రా విమర్శలు

02

అవినీతికి కేరాఫ్ వరంగల్ మహా నగర పాలక సంస్థ. తరుచూ వార్తల్లో నిలిచే ప్రభుత్వ శాఖల్లో ఇది ఒకటి. పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన అధికారులు అక్రమాలకు తెరలేపారు. అశాస్త్రీయంగా మొక్కల పెంపకం, క్షేత్ర స్థాయిలో మొక్కలకు, స్టాక్ రిజిష్టర్ లోని అంకెలకు భారీ తేడా బయటపడింది. నిధుల వ్యయంపై అనేక ఫిర్యాదులు వెల్లువెత్తాయి. గ్రేటర్ మున్సిపల్ కార్పొరేషన్ లో హార్టికల్చర్ ఆఫీసర్ గా సునీత మే 20, 2017లో చేరారు. వ్యవసాయ శాఖలో అసిస్టెంట్ డైరెక్టర్ గా పనిచేసే ఆమె ఫారన్ సర్వీస్ కింద డిప్యూటేషన్ పై గ్రేటర్ వరంగల్ లో అడుగుపెట్టారు. విధుల్లో చేరినప్పటి నుంచి హార్టికల్చర్ విభాగంపై అనేక ఫిర్యాదులు వెల్లువెత్తాయి. ఆమెపై అనేక ఆరోపణలు రావడంతో గ్రేటర్ వరంగల్ అప్పటి కమిషనర్ ప్రావీణ్య మున్సిపల్ అదనపు కమిషనర్ రషీద్ ను విచారణ అధికారిగా నియమించి నివేదక కోరారు. ఆయన క్షేత్ర స్థాయిలో పర్యటించి, రికార్డులను పరిశీలించారు. నిధుల వ్యయంపై ఆరా తీశారు. అన్ని అంశాలను క్షుణ్ణంగా తెలుసుకున్న ఆయన సునీత నిధుల దుర్వినియోగానికి, అక్రమాలకు పాల్పడ్డట్టు నిర్ధారించారు. తన నివేదికను కమిషనర్ అందించారు. అదే రిపోర్ట్ ను కమిషనర్, ఐఏఎస్ అధికారిణి 26ఏప్రిల్ 2022 న ప్రభుత్వానికి పంపించారు. ఆమెను గ్రేటర్ వరంగల్ నుంచి మాతృ శాఖకు పంపించారు తప్పితే, దాదాపు రెండేళ్లైనా ఆమెపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం విమర్శలకు తావిస్తున్నది. - అక్షర దర్బార్ , వరంగల్ ప్రతినిధి

డాక్టర్స్ కాలనీ పార్కు

వరంగల్ బీఆర్ఎస్ అభ్యర్థి
ఎవరు?

- ఇంకా ప్రకటించని గులాబీ పార్టీ
- ఇప్పటికే కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థుల ఖరారు
- కమలం నుంచి అరూరి, హస్తం తరపున కడియం కావ్య
- కారు నుంచి బరిలో దిగేందుకు ఆశావహుల పోటీ
- వీడని ఉత్కంఠ

వరంగల్ పార్లమెంటు నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ కూడా తమ పార్టీ అభ్యర్థిని ప్రకటించడంతో బీఆర్ఎస్ అధిష్టానం తమ పార్టీ అభ్యర్థి ఎంపికపై కసరత్తును వేగవంతం చేసింది. బలమైన అభ్యర్థిని తమ పార్టీ నుంచి ఇక్కడ బరిలో దించేందుకు ఈ నియోజకవర్గ పరిధిలోని బీఆర్ఎస్ ముఖ్య నేతలతో చర్చిస్తుంది. ప్రధానంగా ఆశావహుల్లో కొందరు పేర్లపై అభిప్రాయ సేకరణ కూడా నిర్వహిస్తున్నట్లు తెలిసింది. వరంగల్ లోక్ సభ నియోజకవర్గ నుంచి కొద్దిరోజుల క్రితం బీజేపీ అధిష్టానం తమ పార్టీ అభ్యర్థిగా వర్ధన్న పేట మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్ ను ప్రకటించిన విషయం తెలిసిందే. తాజాగా సోమవారం రాత్రి కాంగ్రెస్ వరంగల్ పార్లమెంటు స్థానం నుంచి తమ పార్టీ అభ్యర్థిగా కడియం కావ్య పేరును ఖరారు చేసింది. కానీ ఇప్పటి వరకు బీఆర్ఎస్ తమ అభ్యర్థిని ప్రకటించలేదు. దీంతో ఆశావహుల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. మరోవైపు వరంగల్ బీఆర్ఎస్ అభ్యర్థి ఎవరని ప్రజలు విస్తృతంగా చర్చించుకుంటున్నారు.

– అక్షర దర్బార్, వరంగల్ ప్రతినిధి

02

అక్షర దర్బార్
voice of the people
తెలుగు దినపత్రిక

చర్యలేవి..?

- మహానగరంలో అక్రమాలకు పాల్పడిన హార్టికల్చర్ అధికారిణి
- నర్సరీల నిర్వహణకు రూ. 48లక్షలు.. మొక్కల కొనుగోలుకు రూ.46లక్షలు
- జీడబ్ల్యూఎంసీ హరిత నిధి దుర్వినియోగమైనట్లు వెల్లడి
- అక్రమాలపై సమగ్ర నివేదికను సర్కార్ కు పంపిన కమిషనర్
- రెండేళ్లు గడిచినా ఐఏఎస్ అధికారిణి రిపోర్ట్ బుట్టదాఖలు
- బాధ్యులపై చర్యలు లేకపోవడంపై సర్వత్రా విమర్శలు

అక్షర దర్బార్ , వరంగల్ ప్రతినిధి:

అవినీతికి కేరాఫ్ వరంగల్ మహా నగర పాలక సంస్థ. తరుచూ వార్తల్లో నిలిచే ప్రభుత్వ శాఖల్లో ఇది ఒకటి. పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన అధికారులు అక్రమాలకు తెరలేపారు. అశాస్త్రీయంగా మొక్కల పెంపకం, క్షేత్ర స్థాయిలో మొక్కలకు, స్టాక్ రిజిష్టర్ లోని అంకెలకు భారీ తేడా బయటపడింది. నిధుల వ్యయంపై అనేక ఫిర్యాదులు వెల్లువెత్తాయి. గ్రేటర్ మున్సిపల్ కార్పొరేషన్ లో హార్టికల్చర్ ఆఫీసర్ గా సునీత మే 20, 2017లో చేరారు. వ్యవసాయ శాఖలో అసిస్టెంట్ డైరక్టర్ గా పనిచేసే ఆమె ఫారన్ సర్వీస్ కింద డిప్యూటేషన్ పై గ్రేటర్ వరంగల్ లో అడుగుపెట్టారు. విధుల్లో చేరినప్పటి నుంచి హార్టికల్చర్ విభాగంపై అనేక ఫిర్యాదులు వెల్లువెత్తాయి. ఆమెపై అనేక ఆరోపణలు రావడంతో గ్రేటర్ వరంగల్ అప్పటి కమిషనర్ ప్రావీణ్య మున్సిపల్ అదనపు కమిషనర్ రషీద్ ను విచారణ అధికారిగా నియమించి నివేదక కోరారు. ఆయన క్షేత్ర స్థాయిలో పర్యటించి, రికార్డులను పరిశీలించారు. నిధుల వ్యయంపై ఆరా తీశారు. అన్ని అంశాలను క్షుణ్ణంగా తెలుసుకున్న ఆయన సునీత నిధుల దుర్వినియోగానికి, అక్రమాలకు పాల్పడ్డట్టు నిర్ధారించారు. తన నివేదికను కమిషనర్ అందించారు. అదే రిపోర్ట్ ను కమిషనర్, ఐఏఎస్ అధికారిణి 26ఏప్రిల్ 2022 న ప్రభుత్వానికి పంపించారు. ఆమెను గ్రేటర్ వరంగల్ నుంచి మాతృ శాఖకు పంపించారు తప్పితే, దాదాపు రెండేళ్లైనా ఆమెపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం విమర్శలకు తావిస్తున్నది.

ప్రైవేట్ నీటి ట్యాంకర్లకు రూ.18లక్షల వ్యయం

నగర ప్రజలు ఆహ్లాదరకమైన వాతావరణానికి పార్క్ లను సందర్శిస్తుంటారు. కానీ గ్రేటర్ లోని పార్క్ ల నిర్వహణ అధ్వాన్నంగా ఉండటంతో వచ్చే వారి సంఖ్య భారీగా తగ్గింది. పార్కులు సరైన రీతిలో లేకపోవడంలో ఆమె నిర్లక్ష్యం కొట్టచ్చినట్లు కనిపిస్తుంది. హరిత హరం, అవెన్యూ ప్లాంటేషన్ లది అదే పరిస్థితి. ఆమె హయాంలో మొక్కల కొనుగోలుకు రూ.46,15,505 వెచ్చించినట్లు నివేదికలో పేర్కొన్నారు. మొక్కలకు ప్రైవేట్ నీటి ట్యాంకర్ల ద్వారా నీటిని తెప్పించి, అందుకు రూ. 18,66,559 అనవసర ఖర్చు చేసినట్లు నిర్ధారించారు. మున్సిపల్ వాటర్ ట్యాంక్స్ ఉన్నప్పటికి ప్రైవేట్ ట్యాంకర్ల ద్వారా తెప్పించడం విమర్శలకు తావిచ్చింది. రూ.48,09,183 కేవలం నర్సరీలకే వ్యయం చేశారు. మొక్కల నీడ కోసం ఉపయోగించే నెట్ ల కోసం రూ.2,56,324 పుట్నాల్లా వెదజల్లారు. రూ.22.24,272 ఖర్చు పెట్టి ట్రీగార్డ్స్ కొనుగోలు చేశారు. ఆమె హయాంలో పొరుగు సేవల ఉద్యోగులకు జీతాలు రూ.1,56,46,369 చెల్లించారంటే అతిశయోక్తి కాదు. గ్రేటర్ వరంగల్ హరిత నిధి రూ.3కోట్లు దుర్వినియోగానికి పాల్పడ్డట్టు విచారణలో వెల్లడైంది. డాక్టర్స్ కాలనీలోని పార్క్ వద్ద రోడ్డుపైనే సెక్యూరిటి గార్డ్ గదిని నిర్మించారు. దీంతో 30అడుగుల రోడ్డు కుంచించుకుపోయింది.

66 వార్డులకు 17 నర్సరీలే ఏర్పాటు

నగరంలో 66 వార్డులు ఉన్నాయి. ఒక్కో వార్డుకు ఒక్కో నర్సరీ ఉండాలని ఉన్నతాధికారులు సూచించారు. అయినా నగరంలో కేవలం 17 నర్సరీలు మాత్రమే ఏర్పాటు చేశారు. ఉన్న నర్సీలు కూడా అశాస్రీయంగా నిర్వహిస్తున్నారు. కనీసం వీటి వద్ద నేమ్ బోర్డ్ లు కూడా లేవు. సకాలంలో మొక్కలకు ఎరువులు వేయకపోవడంతో చాలా మొక్కలు ఎండిపోయాయి. ఒక్కో సంచిలో ఒక్కో మొక్కను పెంచాలి. మొక్క పెరిగాక సంచిని మార్చడం వంటివి చేయలేదు. క్రిస్టియన్ కాలనీలోని నర్సరీ వద్ద ఎర్రమట్టి డంప్ నెలల తరబడి అక్కడే నిల్వ చేయడంతో ఆ మట్టి దుర్వినియోగమైంది. ఉద్యోగులకు మూడు నాలుగు నెలలకోసారి వేతనం చెల్లించారు. 150 కార్మికులను రెన్యూవల్ చేయాల్సి ఉండగా సకాలంలో ఫైల్ సిద్ధం చేయలేదు.

బీఆర్ఎస్ నుంచి ఎవరు?

- వరంగల్ పార్లమెంటు స్థానంలో కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థుల వెల్లడి
- బీజేపీ నుంచి అరూరి, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా కడియం కావ్య
- గులాబీ పార్టీ అభ్యర్థిత్వం కోసం పలువురు పోటీ
- బలమైన అభ్యర్థిని బరిలోకి దింపేందుకు బీఆర్ఎస్ కసరత్తు
- ఆశావహుల్లో ఉత్కంఠ

అక్షర దర్బార్, వరంగల్ ప్రతినిధి:

వరంగల్ పార్లమెంటు నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ కూడా తమ పార్టీ అభ్యర్థిని ప్రకటించడంతో బీఆర్ఎస్ అధిష్టానం తమ పార్టీ అభ్యర్థి ఎంపికపై కసరత్తును వేగవంతం చేసింది. బలమైన అభ్యర్థిని తమ పార్టీ నుంచి ఇక్కడ బరిలో దించేందుకు ఈ నియోజకవర్గ పరిధిలోని బీఆర్ఎస్ ముఖ్య నేతలతో చర్చిస్తుంది. ప్రధానంగా ఆశావాహుల్లో కొందరు పేర్లపై అభిప్రాయ సేకరణ కూడా నిర్వహిస్తున్నట్లు తెలిసింది. వరంగల్ లోక్ సభ నియోజకవర్గ నుంచి కొద్దిరోజుల క్రితం బీజేపీ అదిష్టానం తమ పార్టీ అభ్యర్థిగా వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్ ను ప్రకటించిన విషయం తెలిసిందే. తాజాగా సోమవారం రాత్రి కాంగ్రెస్ వరంగల్ పార్లమెంటు స్థానం నుంచి తమ పార్టీ అభ్యర్థిగా కడియం కావ్య పేరును ఖరారు చేసింది. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ఒక ప్రకటన విడుదల చేసింది. దీంతో ఇక్కడ ప్రధాన రాజకీయ పార్టీల్లో ఇప్పటికే బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థులు ఎవరనేది తేలిపోయింది. బీజేపీ నుంచి బరిలో దిగిన మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్ ఇప్పటికే ప్రచారంలో దూసుకుపోతున్నారు. రమేష్ తో పాటు కాంగ్రెస్ నుంచి అభ్యర్థిత్వం దక్కిన కడియం కావ్య ఇద్దరూ బీఆర్ఎస్ వీడిన నేతలే కావటం విశేషం. బీఆర్ఎస్ అధిష్టానం తనను చిన్నచూపు చూస్తుందనే అసంతృప్తితో అరూరి కారు దిగి కాషాయతీర్థం పుచ్చుకున్నారు. బీజేపీ అధిష్టానం ఆయనను వరంగల్ పార్లమెంటు నియోజకవర్గం నుంచి తమ పార్టీ అభ్యర్థిగా ప్రకటించింది. అంతకు ముందే బీఆర్ఎస్ అధిష్టానం స్టేషన్ గణపురం

ఎమ్మెల్యే, మాజీ డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి కూతురు కడియం కావ్యను వరంగల్ లోక్ సభ స్థానం నుంచి తమ పార్టీ అభ్యర్థిగా ఖరారు చేసింది. కడియం కావ్య ఈ నియోజకవర్గం పరిధిలోని బీఆర్ఎస్ ముఖ్య నేతలను కలవడంతోపాటు గులాబీ దళపతి మాజీ ముఖ్యమంత్రి కే చంద్రశేఖర రావును కూడా మర్యాదపూర్వకంగా కలిసి తనను అభ్యర్థిగా ప్రకటించడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. ఆ తర్వాత మూడు రోజులకే ఆమె తన తండ్రి కడియం శ్రీహరితో కలిసి బీఆర్ఎస్ కు గుడ్ బై చెప్పారు. బీఆర్ఎస్ నుంచి అభ్యర్థిగా పోటీలో ఉండలేనని, అభ్యర్థిగా విరమించుకుంటున్నట్లు కడియం కావ్య ప్రకటించారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరి, కావ్య కాంగ్రెస్ పార్టీలో చేరారు. ముందుగా కుదిరిన అవగాహన ప్రకారం కాంగ్రెస్ పార్టీ అధిష్టానం కడియం కావ్యను తమ పార్టీ వరంగల్ పార్లమెంటు నియోజకవర్గం అభ్యర్థిగా ఖరారు చేసింది.

కాంగ్రెస్ సమావేశానికి బీఆర్ఎస్ ఎమ్మెల్యే హాజర్..

- ఖమ్మం జిల్లాలో ఆసక్తికర రాజకీయం
- 6న హస్తం గూటికి డాక్టర్ తెల్లం వెంకట్రావ్..?

అక్షర దర్బార్, ఇల్లందుః ఖమ్మం జిల్లాలో ఆసక్తికర రాజకీయ పరిణామం చోటుచేసుకుంది. కాంగ్రెస్ సమావేశానికి బీఆర్ఎస్ ఎమ్మెల్యే హాజరవ్వడం విస్మయానికి గురిచేసింది. మహబూబాబాద్ లోకసభ కాంగ్రెస్ పార్టీ సమావేశం ఇల్లందులో మంత్రి తుమ్మల ఆధ్వర్యంలో మంగళవారం జరిగింది. సమావేశంలో ఎమ్మెల్యేలు దొంతి మాధవరెడ్డి, రాం చంద్రునాయక్, మాజీ ఎమ్మెల్యే పొదెం వీరయ్య, ఎంపీ అభ్యర్థి బలరాం నాయక్ హాజరయ్యారు. కాగా, భద్రాచలం బీఆర్ఎస్ ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావ్ అటెండ్ అవ్వడం చర్చనీయాంశమైంది. కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకోకుండానే కాంగ్రెస్ కు మద్ధతివ్వడం రాజకీయ వర్గాలను ఆశ్చర్యానికి గురిచేసింది. ఈ పరిణామాన్ని బట్టి ఆయన పార్టీ మారడం ఖాయమని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. తుక్కుగూడలో జరిగే సభలో ఆయన లాంఛనంగా హస్తం గూటికి చేరుతారని పలువురు నేతలు అభిప్రాయపడుతున్నారు.

కాంగ్రెస్ సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు

రూ.260 కోట్లతో నగరాభివృద్ధి

- పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

అక్షర దర్బార్, వరంగల్ ప్రతినిధి : రూ.260 కోట్ల నిధులతో నగరాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నామని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి పేర్కొన్నారు. హనుమకొండలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పదేళ్లలో బీఆర్ఎస్ చేయలేని పనులను నాలుగు నెలల్లో హనుమకొండలో చేశామన్నారు. వర్షానికి మోరంచ గ్రామం మునిగిపోయి 8 మంది చనిపోతే అప్పటి ఎమ్మెల్యేలు ఆ గ్రామంలో పర్యటించలేదని గుర్తుచేశారు. బీఆర్ఎస్ నాయకులు జీవితకాలం సరిపోయే పాపాలు చేశారని ధ్వజమెత్తారు. ఎన్నికల్లో ఓటమి చెందినా అహంకారం తగ్గలేదన్నారు. నయీం నగర్ నాళా నిర్మాణం ఆపేందుకు దుర్మార్గపు చర్యలు చేస్తున్నారని విమర్శించారు. రెండు దఫాలుగా అధికారంలో ఉండి కూడా కాళోజీ కళాక్షేత్రాన్ని పూర్తి చేయలేకపోయారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 24గంటలు ప్రజల సమస్యల పరిష్కారం కోసం పరితపిస్తున్నానని చెప్పారు. వరంగల్ జిల్లాను అభివృద్ధికి దూరం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. సెంట్రల్ జైలును తొలగించారని గుర్తుచేశారు. సమావేశంలో కార్పొరేటర్ తోట వెంకటేశ్వర్లు, ఈవీ శ్రీనివాస్, బత్తిని శ్రీనివాస్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

మాట్లాడుతున్న సీఎం రేవంత్ రెడ్డి

తుక్కుగూడలోనే జాతీయ మ్యానిఫెస్టో విడుదల

కాంగ్రెస్ జనజాతర సభ ప్రాంగణాన్ని పరిశీలించిన సీఎం రేవంత్ రెడ్డి

అక్షర దర్బార్, హైదరాబాద్‌: రంగారెడ్డి జిల్లా తుక్కుగూడలో జరిగే సభలోనే కాంగ్రెస్ జాతీయ ఎన్నికల మ్యానిఫెస్టోను విడుదల చేస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. తుక్కుగూడలో ఈనెల 6న నిర్వహించే కాంగ్రెస్ జనజాతర సభ ప్రాంగణాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం కాంగ్రెస్ పార్టీకి ఎంతో ప్రత్యేకమన్నారు. జాతీయ మ్యానిఫెస్టో ప్రకటనకు తెలంగాణను ఎంచుకున్నందుకు ఏఐసీసీ అధినాయకత్వానికి సీఎం కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర కల సాకారమైంది సోనియాగాంధీ వల్లేనని పేర్కొన్నారు. ఈ సభకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, ఇతర ముఖ్య నేతలంతా వస్తారని వెల్లడించారు. రాష్ట్ర నలుమూలల నుంచి లక్షలాది మంది ఈ సభకు తరలి రావాలని సీఎం పిలుపునిచ్చారు. ఆసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఆరు గ్యారంటీలను తుక్కుగూడ సభలోనే ప్రకటించామని గుర్తు చేశారు. ఆరు హామీల్లో ఐదింటిని ఇప్పటికే అమలు చేసి చూపించామని చెప్పారు. కేసీఆర్ పదేళ్ల పాలనలో వందేళ్ల విధ్వంసం జరిగిందని సీఎం రేవంత్ ధ్వజమెత్తారు. అధికారం పోయాక, బిడ్డ జైలుకు వెళ్లాక కేసీఆర్‌కు ప్రజలు గుర్తుకు వచ్చారన్నారు. వేల పుస్తకాలు చదివిన కేసీఆర్‌కు వానకాలం ఎప్పుడు వచ్చేది తెలియదా అంటూ ప్రశ్నించారు.

కాంగ్రెస్ పాలనలో రాష్ట్రం అధోగతి

రైతులకి బోనస్ మద్దతు ధర అందించాలి

మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి

అక్షర దర్బార్,ఖానాపూర్ : కాంగ్రెస్ పాలనలో రాష్ట్రం సంక్షోభం వైపు నడుస్తోందని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి ఆరోపించారు. మంగళవారం బుధరావుపేట గ్రామంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి మాట్లాడారు. గతంలో సాగునీటి ప్రాజెక్టులు అందుబాటులోకి తీసుకువచ్చిన కేసీఆర్ ప్రభుత్వాన్ని బద్నాం చేసే ఉద్దేశపూర్వక దుష్ప్రచారానికి మాత్రమే ప్రాధాన్యత ఇస్తూ రేవంత్ రెడ్డి ప్రభుత్వం సెల్ఫ్ గోల్ చేసుకుందని విమర్శించారు. ప్రస్తుత ప్రభుత్వ

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పెద్ది

తీరుతో చెరువులు, కాలువల్లో సరిపడా సాగు నీళ్లు లేక, లోవోల్టేజ్ సమస్యతో మోటార్లు కాలిపోవడం ప్రారంభమైందన్నారు. పాకాల ఆయకట్టుకు 100 శాతం నీళ్లిస్తామని చెప్పిన కాంగ్రెస్ నాయకులు ఇప్పుడు తప్పించుకొని తిరుగుతున్నారని మండిపడ్డారు. ఇరిగేషన్ అధికారులతో సమీక్ష జరుపలేని నాయకుడు స్థానిక కాంగ్రెస్ ఎమ్మెల్యే అని ఎద్దేవా చేశారు. రైతులకి జరిగిన నష్టంపై ఎమ్మెల్యేతో పాటు సీఎం పూర్తి బాధ్యత వహించాలని డిమాండ్ చేసారు. బీఆర్ఎస్ ప్రభుత్వ పనితీరుకు కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరుని నాలుగు నెలల్లోనే ప్రజలు తేడాను గ్రహించినట్లు తెలిపారు. ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన ప్రకారం వరి ధాన్యం క్వింటాల్ కు ప్రభుత్వ మద్దతు ధర రూ.2183 అదనంగా మరో రూ.500 బోనస్ అందించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 6న నిర్వహించే "రైతు దీక్ష"కు రైతులు భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు.

నర్సరీల్లో వంద శాతం మొక్కలను కాపాడాలి

వరంగల్ జెడ్పీ సీఈవో రామిరెడ్డి

అక్షర దర్బార్, దుగ్గొండి : నర్సరీలో మొక్కలను కాపాడేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని వరంగల్ జెడ్పీ సీఈవో రామిరెడ్డి అధికారులకు జీపీ సిబ్బందికి సూచించారు. మంగళవారం మండలంలోని చలపతి గ్రామంలో ఆయన పల్లె ప్ర ప్రగతి పనులను తనిఖీ చేసి గ్రామ నర్సరీని పరిశీలించారు ఈ సందర్భంగా మొక్కల సంరక్షణకు చేపడుతున్న చర్యలను జీపి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆయనవెంట ఎంపీడీవో అరుంధతి, ఎంపీవో శ్రీధర్ గౌడ్, పంచాయతీ కార్యదర్శి కావ్య, జీపీ సిబ్బంది శ్రీనివాస్, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు

నర్సరీని పరిశీలిస్తున్న జెడ్పీ సీఈవో

సిబ్బందికి సూచనలిస్తున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

కలెక్టర్ సిక్తా పట్నాయక్

అక్షర దర్బార్, పరకాల : వేసవి కాలం దృష్ట్యా ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు వైద్య సేవలను అందించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. పరకాల సామాజిక వైద్యశాలను కలెక్టర్ మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో అందిస్తున్న ఓపి సేవల వివరాలను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. వడగాలుల నేపథ్యంలో ఆసుపత్రిలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు, సరిపోను మందుల నిల్వలు ఉండాలని సూచించారు. అనంతరం తాగునీటి సరఫరా, నిర్వహణపై స్థానిక ఆర్డీవో, పురపాలక కమిషనర్, ఎంపీడీవో, ఎంపీవో, ఇతర అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహిస్తున్న ప్రిసైడింగ్, అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారుల శిక్షణ కార్యక్రమాన్ని కలెక్టర్ పరిశీలించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలపై స్థానిక అధికారులను వివరాలను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట ఆర్డీవో డాక్టర్ కె.నారాయణ, తహసీల్దార్ ఏవీ భాస్కర్, పురపాలక కమిషనర్ నర్సింగం, ఎంపీడీవో ఆంజనేయులు, ఇన్‌స్పెక్టర్ రవిరాజు, ఎంఈవో రమాదేవి ఉన్నారు.

బీఆర్ఎస్ తోనే ప్రజా సంక్షేమం..

కాంగ్రెస్ పాలనలో రైతులకు కన్నీరే..

ఎకరాకు రూ.25వేల నష్టపరిహారం ఇవ్వాలి

మాజీ మంత్రి, పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్

అక్షర దర్బార్, మల్హర్ : తొమ్మిన్నరేండ్ల బీఆర్ఎస్ ప్రభుత్వం, మాజీ సీఎం కేసీఆర్పాలనలో రాష్ట్రంలో ఎక్కడా ఒక్క ఎకరం పొలం ఎండలేదని మాజీ మంత్రి, పెద్దపల్లి పార్లమెంట్అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ అన్నారు. మంథని నియోజకవర్గంలో ఎండిన పంటపొలాలను జిల్లా పరిషత్చైర్మన్పుట్ట మధూకర్తో కలిసి ఆయన పరిశీలించారు. ఏండిన పంటలను చూపిస్తూ కన్నీరు పెట్టుకున్న రైతులను వారు ఓదార్చారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి మాట్లాడుతూ రైతుల పట్ల ముందుచూపు లేని కాంగ్రెస్ప్రభుత్వం మూడు మాసాల్లో రైతులకు కన్నీరు మిగిల్చిందని విమర్శించారు. కష్టకాలంలో రైతులకు భరోసా ఇవ్వాల్సింది పోయి గత ప్రభుత్వంపై నిందలు వేయడం విడ్డూరంగా ఉందన్నారు. అకాల వర్షాలతో పంట నష్టం జరిగితే ఆనాడు తమ ప్రభుత్వం రైతులకు నష్టపరిహారం అందించి ఆదుకుందనే విషయాన్ని కాంగ్రెస్పాలకులు గుర్తించాలన్నారు. ఎండిన పంట ఎకరాకు రూ.25వేల చొప్పున అందించి ఆదుకోవాలని, అలాగే పంట మద్దతు ధర రూ.500 బోనస్పై వెంటనే ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు.

ఎండిపోయిన వరి పొలాన్ని పరిశీలిస్తున్న మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

రైతుల పక్షాన మాట్లాడితే రాజకీయాలు చేయడమా : జెడ్పీ చైర్మన్, పుట్ట మధూకర్

రైతుల పక్షాన మాట్లాడితే రాజకీయాలు చేస్తున్నారనడం విడ్డూరంగా ఉందని జెడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్ విమర్శించారు. మంథని నియోజకవర్గంలో ఎండిపోయిన పంట పొలాలను మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ తో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెల రోజులుగా నీళ్లు రాకపోవడంతో పంట పూర్తిగా చేతికి రాకుండా పోయిందని వాపోయారు. ఎండిన పంటలకు నష్టపరిహారంతో పాటు మిగిలిన పంటలను కాపాడాలన్నారు. రైతులను ఆదుకునే వరకూ పోరాటం చేస్తామని ఆయన స్పష్టం చేశారు.

6 నుంచి సదరం క్యాంపులు

- **6, 15న నర్సంపేట ఆసుపత్రిలో**
- **26న వర్ధన్నపేటలో సదరం శిబిరాలు..**
- **సద్వినియోగం చేసుకోండి : డీఆర్డీవో**

నర్సంపేట, అక్షర దర్బార్: వివిధ కారణాలతో అంగ వైకల్యం పొందిన దివ్యాంగులను గుర్తించేందుకు ఈ నెల 6నుంచి సదరం క్యాంపులను నిర్వహిస్తున్నట్లు జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సదరం క్యాంపునకు హాజరయ్యే దివ్యాంగులు ముందుగా మీ సేవలో వివరాలు నమోదు చేసుకోవాలని తెలిపారు.

కాంగ్రెస్ పాలనలో అవినీతి, దోపిడీ

- వరంగల్ లో బీజేపీ గెలుపు తథ్యం..
- బీజేపీ ఎంపీ అభ్యర్థి అరూరి రమేష్

సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ వరంగల్ ఎంపీ అభ్యర్థి అరూరి రమేష్

అక్షర దర్బార్, పరకాల/రేగొండ: కాంగ్రెస్ పాలనలో రాష్ట్రం అదోగతి పాలవుతోందని బీజేపీ వరంగల్ ఎంపీ అభ్యర్థి అరూరి రమేష్ విమర్శించారు. మంగళవారం పరకాల, నడికూడ, రేగొండ, గోరికొత్తపల్లి, శాయంపేట మండల బూత్ అధ్యక్షులు, కార్యకర్తలతో పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశం జరిగింది. కార్యక్రమానికి అరూరి రమేష్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కార్యకర్తలు గెలుపే లక్ష్యంగా పని చేయాలని పిలుపునిచ్చారు. వరంగల్ నుంచి గెలిచి మోడీకి బహుమతిగా ఇవ్వాలని అన్నారు. కార్యక్రమంలో సభా అధ్యక్షులు దాసరి తిరుపతిరెడ్డి, ప్రసాద్, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కీర్తి రెడ్డి, రాష్ట్ర క్రమశిక్షణ సంఘం సభ్యులు నాగపురి రాజమౌళి, పార్లమెంట్ కన్వీనర్లు మురళీధర్ గౌడ్, కుమార్ స్వామి, హన్మకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గురు ప్రసాద్, రాష్ట్ర నాయకులు కాలి ప్రసాద్, కౌన్సిలర్ జయంత్ లాల్, ఎస్సీ మోర్చా అధ్యక్షుడు రాజ భద్రయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాజవీరు, జిల్లా కార్యదర్శి రామన్న, బాబు యాదవ్, పట్టణ అధ్యక్షుడు మార్త భిక్షపతి, రూరల్ అధ్యక్షుడు ముస్కే దేవేందర్, మండల అధ్యక్షుడు రాజిరెడ్డి, నాయకులు కుక్కల విజయ్ కుమార్, వేనిశెట్టి శారద, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వెన్నంపల్లి పాపయ్య, జిల్లా అధ్యక్షుడు ఏడునూతుల నిషిధర్ రెడ్డి, పార్లమెంట్ కో కన్వీనర్ ప్రసాదరావు, నియోజకవర్గ కన్వీనర్ రవీందర్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు మొగిలి, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు తిరుపతిరావు, బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గాలిఫ్ తదితరులు పాల్గొన్నారు.

వివరాలను వెల్లడిస్తున్న ఏసీపీ దేవేందర్ రెడ్డి

ఇద్దరు నకిలీ నక్సలైట్లు అరెస్ట్

స్మార్ట్, కీప్యాడ్ ఫోన్, లెటర్ ప్యాడ్లు స్వాధీనం

అక్షర దర్బార్, హనుమకొండ : నక్సల్స్ పేరుతో బెదిరింపులకు పాల్పడుతున్న ఇద్దరు నకిలీ నక్సలైట్లను హనుమకొండ, సీసీఎస్ పోలీసులు సంయుక్తంగా అరెస్ట్ చేశారు. ఈ అరెస్ట్ కు సంబంధించి హనుమకొండ ఏసీపీ దేవేందర్ రెడ్డి మంగళవారం మీడియా సమావేశంలో వివరాలను వెల్లడించారు. గత నాలుగు రోజుల క్రితం చర్ల శబరి ఏరియా కమిటీ సీపీఐ మావోయిస్ట్ కమాండర్ దేవన్న పేరుతో గుర్తు తెలియని వ్యక్తి ఎస్ఎస్ఆర్ గ్రూప్, అజర హాస్పిటల్, దీపక్ స్కిన్ క్లినిక్ హాస్పిటళ్లకు లేఖ ఇచ్చారు. ఇందులో పాలను ఎక్కువ ధరకు అమ్ముతున్నారని, రోగుల ప్రాణాలతో చెలగాటం ఆడుతూ డబ్బులు దండుకుంటున్నారని పేర్కొంటూ అందుకు ఎస్సెస్సార్ గ్రూప్, హాస్పిటల్ ఆస్తుల వివరాలు, భూమి పత్రాలు, ఇంటి స్థల పత్రాలు, లైసెన్సు, డబ్బులు పట్టుకొని చర్చకు రావాలని పేర్కొన్నారు. దీనిపై బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో మంగళవారం ములుగు రోడ్డులో హనుమాన్ జంక్షన్ వద్ద వాహనాల తనిఖీ చేస్తుండగా దాసరి శ్రీకాంత్, బాలిని మహేష్ అనుమానాస్పదంగా సంచరించడంతో పోలీసులు పట్టుకుని విచారించగా, నేరాన్ని అంగీకరించారు. వీరిలో శ్రీకాంత్ నల్లబెల్లి మండలంలోని గొల్లపల్లి నివాసి కాగా, మహేష్ కరీమాబాద్ కు చెందిన వ్యక్తిగా పోలీసులు గుర్తించారు. వీరి నుండి రెండు మొబైల్స్, మావోయిస్టుల పేరుతో ఉన్న 70 ఖాళీ లెటర్ ప్యాడ్ పత్రాలు, బైక్, కంప్యూటర్ ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కాగా, నిందితులను పట్టుకోవడంలో ప్రతిభకనబరిచిన హనుమకొండ, సీసీఎస్ పోలీసులను ఏసీపీ అభినందించారు.

సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ ను ప్రారంభిస్తున్న సీపీ అంబర్ కిషోర్ ఝా

హెడ్ క్వార్టర్ లో సైబర్ క్రైమ్స్ పోలీస్ స్టేషన్

ప్రారంభించిన సీపీ అంబర్ కిషోర్ ఝా

అక్షర దర్బార్, హనుమకొండ: వరంగల్ పోలీస్ కమిషనరేట్లో నూతనంగా ఏర్పాటు చేసిన సైబర్ క్రైం పోలీస్ స్టేషన్‌ను వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ సైబర్నేరాలపై ప్రజల్లో అవగాహన ఉండాలని, సైబర్నేరగాళ్ల ఉచ్చులో పడొద్దని సూచించారు. సైబర్ నేరాలకు గురైన బాధితులు ఇకపై వరంగల్పోలీస్కమిషనరేటులో ఏర్పాటు చేసిన సైబర్క్రైమ్పోలీస్స్టేషన్లో ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. కార్యక్రమములో డీసీపీలు రవీందర్, అబ్దుల్బారీ, ట్రైనీ ఐపీఎస్అధికారులు అంకిత్, శుభంనాగ్, అదనపు డీసీపీలు రవి, సంజీవ్, సురేష్కుమార్, సైబర్క్రైమ్పోలీస్స్టేషన్ఏసీపీ విజయ్కుమార్, ఇన్ స్పెక్టర్రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

రేపు ఇస్తార్ విందు

అక్షర దర్బార్, మల్హర్ : తాడిచెర్ల జమా మసీదులో రేపు ఇస్తార్ విందు ఏర్పాటు చేస్తున్నట్లు భూపాలపల్లి జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు దండు రమేష్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, శ్రీపాద ట్రస్ట్ చైర్మన్ దుద్దిళ్ల శ్రీను బాబు ఆదేశాల మేరకు ఇస్తార్ విందు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి ముస్లిం సోదరులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ఘటనా స్థలంలో లభ్యమైన ఆయుధాలు

ఛత్తీస్‌ఘడ్‌లో భారీ ఎన్ కౌంటర్

- 8 మంది మావోయిస్టులు మృతి
- భారీగా ఆయుధాలు స్వాధీనం..

అక్షర దర్బార్, బీజాపూర్ : ఛత్తీస్ ఘడ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లాలో భారీ ఎన్ కౌంటర్ జరిగింది. మంగళవారం ఉదయం పొర్చెలి అటవీ ప్రాంతంలో పోలీసులు, మావోయిస్టులకు మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో నలుగురు మావోయిస్టులు మృతి చెందారు. పలువురికి గాయాలైనట్లు సమాచారం. ఇంకా సెర్చ్ ఆపరేషన్ కొనసాగుతున్నట్లు తెలిసింది. అటవీ ప్రాంతంలో కూంబింగు నిర్వహిస్తున్న భద్రతా బలగాలకు మావోయిస్టులు తారసపడ్డట్లు తెలుస్తోంది. ఘటనా స్థలం వద్ద మందుపాతరలు, ఆయుధాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. బీజాపూర్ జిల్లాలో ఈ వారంలో ఇది రెండో ఎన్ కౌంటర్. ఈ ఘటనలతో ఆ ప్రాంత ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు.

బహుజన వీరుడు సర్వాయి పాపన్న గౌడ్

నివాళులర్పిస్తున్న గౌడ సంఘం నాయకులు

అక్షర దర్బార్, దుగ్గొండి : తొలి బహుజన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ మహారాజ్ అని గౌడ జన హక్కుల పోరాట సమితి మోకుదెబ్బ నర్సంపేట డివిజన్ అధ్యక్షుడు కందుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. మంగళవారం మండలంలోని మల్లంపల్లి గ్రామంలో మోకుదెబ్బ మండల అధ్యక్షుడు తడుక కొమురయ్య గౌడ్, గౌడ సంఘం అధ్యక్షుడు, మోకుదెబ్బ మండల ఉపాధ్యక్షుడు గుండెబోయిన రమేష్ గౌడ్ అధ్యక్షతన పాపన్న గౌడ్ 314 వ వర్ధంతిని నిర్వహించారు. ముఖ్య అతిథిగా కందుల శ్రీనివాస్ గౌడ్ హాజరై పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మల్లంపల్లి గౌడ సంఘం ఉపాధ్యక్షుడు కక్కెర్ల రామకృష్ణ గౌడ్, మోకుదెబ్బ డివిజన్ నాయకులు కెక్కెర్ల సదానందం గౌడ్, కెక్కెర్ల కుమారస్వామి గౌడ్, గైని రాములు గౌడ్, కెక్కెర్ల రాజు గౌడ్, కెక్కెర్ల సాంబయ్య గౌడ్, కందుల కుమారస్వామి గౌడ్, కక్కర్ల భిక్షపతి గౌడ్, కెక్కెర్ల సారంగం గౌడ్, కెక్కెర్ల సాంబమూర్తి గౌడ్, రమేష్ గౌడ్, సతీష్ గౌడ్, మధు గౌడ్ పాల్గొన్నారు.